ఏజెన్సీ గ్రామంలో మద్యపాన నిషేధం

నల్లబెల్లి, సెప్టెంబర్ 21: వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలానికి సరిహద్దులో ఉన్న ఏజెన్సీ గ్రామం గొల్లపల్లె సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేసి ఆదర్శంగా నిలిచింది. గ్రామంలో 750 మంది జనాభా ఉండగా.. చాలా మంది యువత గుడుంబా, మద్యానికి బానిసై యుక్తవయస్సులోనే మృత్యువాత పడ్డా రు. దీంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. మరికొందరు గుడుంబాకు బానిసై కష్టపడి సంపాదించిదంతా తాగుడుకే ఖర్చు చేస్తున్నారు. కుటుంబాలను పట్టించుకోలేదు. దీంతో విసిగిపోయిన గ్రామప్రజలు.. గ్రామం బాగుపడాలంటే మద్యపాన నిషేధమొక్కటే మార్గమని నిర్ణయించుకున్నారు.

ఫార్మాసిటీని రద్దు చేయాలి

- మా భూములను వాపసు ఇవ్వాలి
- నాలుగు గ్రామాల రైతులు డిమాండ్
- సోనియా, రాహుల్‌కు లేఖలు

యాచారం, సెప్టెంబర్ 21: యాచారం మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన ఫార్మాసిటీని వెంటనే రద్దు చేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. ఆ మేరకు కాంగ్రెస్ అధిష్ఠానానికి లేఖలు రాస్తున్నారు. ఇప్పటికే నానక్‌నగర్ గ్రామానికి చెందిన 200 మంది రైతులు లేఖలు రాసిన విషయం తెలిసిందే. ఫార్మాసిటీ వద్దంటూ తాజాగా శనివారం కుర్మిద్ద గ్రామానికి చెందిన కొంత మంది రైతులు పోస్టుకార్డులతో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతోపాటు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖలు రాశారు. కాలుష్యాన్ని వెదజల్లే ఫార్మాసిటీని రద్దుచేయాలని, తమ నుంచి సేకరించిన భూములను తిరిగి ఇవ్వాలని ఆ లేఖల్లో డిమాండ్ చేశారు. ఫార్మాసిటీని రద్దు చేస్తామని గతంలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చాక మాట మార్చడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఫార్మాసిటీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్నికలకు ముందు ఓట్ల కోసం రైతులతో కలిసి పాదయాత్ర చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, ఎమ్మెల్సీలు కోదండరామ్, తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తదితరులు ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పదవులను చేపట్టగానే ఫార్మా బాధిత రైతులను మర్చిపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యూచర్‌సిటీ అంటున్నారే తప్ప ఫార్మాసిటీని రద్దు చేసినట్టు ఎక్కడా జీవో చూపించడం లేదని మండిపడుతున్నారు. పైగా ఫార్మాసిటీని నిర్మించి తీరుతామని హైకోర్టులో ప్రభుత్వం అఫిడవిట్ వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజల ఇబ్బందులను అర్థం చేసుకుని ఇప్పటికైనా ఫార్మాసిటీని రద్దు చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. లేకుంటే ఫార్మా వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఆందోళనలను ఉద్ధృతం చేస్తామని, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులను తమ గ్రామాల్లో తిరుగనివ్వబోమని హెచ్చరించారు.

ఫార్మాసిటీ వద్దంటూ రాసిన ఉత్తరాన్ని చూపుతున్న తాటిపర్తి గ్రామ మహిళ

ఎల్లంపల్లిని పూర్తి చేసిందెవరు?

- కాంగ్రెస్ ప్రాజెక్టు పూర్తి చేస్తే నీళ్లెందుకు నింపలె?
- మంత్రి పొన్నం వ్యాఖ్యలపై నెటిజన్ల విమర్శలు

హైదరాబాద్, సెప్టెంబర్21 (నమస్తే తెలంగాణ): 'కాంగ్రెస్ హయాంలోనే ఎల్లంపల్లి పూర్తయిందని, ఆ ప్రాజెక్టు నుంచే మల్లన్నసాగర్ వరకు రిజర్వాయర్లన్నీ నింపామని, అవి కాళేశ్వరం జలాలు కావు' అని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణవాదుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంత్రి గప్పాలు తప్ప మరేమీలేదని నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. వాస్తవంగా ఎల్లంపల్లి ప్రాజెక్టును తా మే నిర్మించామని కాంగ్రెస్ సర్కారు చెప్తున్న గొప్పలన్నీ కూడా ఒట్టి మాటలే. ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేసినా దానిని వినియోగంలోకి తీసుకురాలేదన్నది అంతే వాస్తవం. జలయజ్ఞంలో భాగంగా 2004లో రూ.3,177 కోట్ల తో 20.16టీఎంసీల నీటి నిల్వసామర్థ్యంతో ఎల్లంపల్లి ప్రాజెక్టును చేపట్టారు. తెలంగాణ వచ్చేనాటికి ప్రాజెక్టుపై రూ.3,347.27 కోట్లు ఖర్చుపెట్టారు. తెలంగాణ ఏర్పడేనాటికి ఏనా డూ ఆ రిజర్వాయర్‌లో 5 టీఎంసీలకు మించి జలాలను నిల్వ చేయలేదు. కారణం భూసేకరణ పూర్తి చేయకపోవటం, ముంపు బాధితులకు పునరావాసం కల్పించకపోవడమే. ప్రాజెక్టు కోసం మొత్తంగా 27,387ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండగా, 18,778 ఎకరాలను మాత్రమే సేకరించింది. ఇక పునరావాసం కల్పనకు 13,296 ఇండ్లను నిర్మించాల్సి ఉండగా, 1,448 ఇండ్లను మాత్రమే పూర్తిచేసింది. అదీగాక ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీటినిల్వ వల్ల లక్షెట్టిపేట బ్రిడ్జి మునిగిపోయి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలకు రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. కానీ తెలంగాణ ఏర్పాటు తర్వాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మరో రూ.2,052.73 కోట్లను వాటి కోసం వెచ్చించింది. బరాజ్‌ను 2016లో పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చింది. ఇదీ వాస్తవం. కానీ అందుకు విరుద్ధంగా ప్రాజెక్టు మొత్తం పూర్తిచేశామని మంత్రి పొన్నం వ్యాఖ్యానించడంపై తెలంగాణవాదులు విమర్శలు గుప్పిస్తున్నారు. అదీగాక ఎల్లంపల్లి నుంచే నీళ్లను తరలించామని చెబుతున్న మంత్రి పొన్నం వాటిని ఏవిధంగా తరలించారో కూడా చెబితే బాగుండేదని చురకలంటిస్తున్నారు. మంత్రి పొన్నం వ్యాఖ్యలు ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమని తెలంగాణవాదులు వివరిస్తున్నారు. అం తేకాదు అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు రూపకల్పన చేసిన ప్రాజెక్ట్‌లోనే ఎల్లంపల్లి, నందిమేడారం, లక్ష్మీబరాజ్, మిడ్ మానేర్, అనంతగిరి రిజర్వాయర్, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ భాగమై ఉన్నాయని అంగీకరించిన పొన్నం మరి ఆ యా రిజర్వాయర్లను నాడు ఎందుకు పూర్తి చేయలేదో కూడా చెబితే బాగుండేదని తెలంగాణవాదులు ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా కేసీఆర్ రీడిజైన్ ఫలితంగానే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులో 14టీఎంసీలుగా నీటి నిల్వ సామ ర్థ్యం ఏకంగా 141టీఎంసీలకు పెరిగిందని తెలంగాణవాదులు గుర్తుచేస్తున్నారు.

ఎల్లంపల్లి నుంచే నీళ్లు ఎత్తిపోశాం: పొన్నం

హైదరాబాద్, సెప్టెంబర్21 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ హయాంలోనే ఎల్లంపల్లి పూర్తయిందని, ఆ ప్రాజెక్టు నుంచే ప్రస్తు తం మల్లన్నసాగర్ వరకు రిజర్వాయర్లన్నీ నింపామని, అయినా కాళేశ్వరం జలాలు అంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు తప్పుదోవ పట్టిస్తున్నారని బీసీ సంక్షేమశాఖ మం త్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులోనే రూపకల్పనలోనే ఎల్లంపల్లి , నందిమేడారం, లక్ష్మీబరాజ్, మిడ్ మానేర్, అనంతగిరి రిజర్వాయర్, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగ ర్ భాగమై ఉన్నాయని చెప్పారు. గాంధీ భవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పొన్నం మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తయిందని తెలిపారు. కేసీఆర్ చేసిన రీడిజైన్ నిరుపయోగమని, మిడ్‌మానేరు, లోయర్ మానేరు, కొండపోచమ్మ సాగర్, మల్లన్నసాగర్‌కు వచ్చే నీరు ఎల్లంపల్లి నుంచి తీసుకున్నవి మాత్రమేనని, విడతల వారీగా వర్షాలు కురవడం వల్లే అది సాధ్యమైందని తెలిపారు. ఆగిన పనులు పూర్తి చేసినంత మాత్రాన ప్రాజెక్టు రూపొందించినట్టవుతుందా? అని ప్రశ్నించారు.

ఫార్మాసిటీ అక్కడే ఉంటుందా..లేదా?

మొదటిపేజీ తరువాయి...

ఇవ్వడంలేదని తప్పుపట్టారు. ఫార్మాసిటీ భూములకు సంబంధించిన పిటిషన్లపై సోమవారం విచారణ చేపడతామని, ఆ లోగా ప్రభుత్వ నిర్ణయంతోపాటు ఫార్మాసిటీకి సంబంధించిన అన్ని వివరాలను తెలియజేయాల్సిందని తేల్చిచెప్పారు. కాగా, ఫార్మాసిటీ యథాతథంగా కొనసాగుతుందంటూ హైకోర్టులో ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. ఫార్మాసిటీ రద్దయినట్టు కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ ఆ అఫిడవిట్‌లో పేర్కొంటూ.. 2016 లో జారీ చేసిన జీవో 31 ప్రకారం ఫార్మాసిటీ యథావిధిగా కొనసాగుతుందని వెల్లడించారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఏర్పాటు కోసం మేడిపల్లిలో 1,700 ఎకరాల సేకరణకు భూసేకరణ చట్టంలోని సెక్షన్ 11(1) కింద గతంలో ప్రాథమిక నోటిఫికేషన్ వెలువడిందని గుర్తుచేశారు. అంతకుముందు ఇదే ఫార్మాసిటీ ఏర్పాటు కోసం 2016లో ప్రభుత్వం జీవో 31ను జారీ చేసిందని, అంతేకాకుండా భూసేకరణ చట్టం కింద కొన్ని మినహాయింపులు ఇస్తూ జీవో 46ను జారీ చేసిందని తెలిపారు. డిక్లరేషన్, పరిహారం అవార్డు నిబంధనల ప్రకారం జరగలేదన్న ఆరోపణలు అవాస్తవమని, భూసేకరణ చట్టంలోని నిబంధనల ప్రకారమే అక్కడ భూసేకరణ చేపట్టామని పేర్కొన్నారు. ప్రభుత్వం సేకరించిన భూముల్లో పిటిషనర్‌కు సంబంధించిన 10 ఎకరాలు ఉన్నాయని తెలిపారు. డిక్లరేషన్ అవార్డుపై పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించారని, విచారణ జరిపిన హైకోర్టు.. అభ్యంతరాల స్వీకరణ సహా భూసేకరణ ప్రక్రియను కొనసాగించాలని ఆదేశించిందని వివరించారు. ఈ ఆదేశాల ప్రకారం భూసేకరణకు సంబంధించిన ప్రాథమిక నోటిఫికేషన్ అమల్లోనే ఉన్నదని, ఈ నేపథ్యంలో సదరు భూములపై ధరణి పోర్టల్‌లో లావాదేవీలకు అనుమతించాలన్న పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. పిటిషనర్ తన భూములపై ధరణి పోర్టల్ ద్వారా ఎలాంటి లావాదేవీలు నిర్వహించలేరని పేర్కొన్నారు. భూసేకరణ ప్రక్రియ అమల్లో ఉన్నందున ధరణిలో ఎంట్రీల కోసం పిటిషనర్ చేసుకున్న దరఖాస్తును అనుమతించలేమని స్పష్టం చేశారు. అంతేకాకుండా అవార్డు నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై అప్పీళ్లు దాఖలు చేశామని, అవి ధర్మాసనం ముందు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. భూసేకరణ నిమిత్తం రెండు పత్రికల్లో నోటిఫికేషన్‌ను ప్రచురించామని, గ్రామసభ నిర్వహించి నోటీసులు జారీచేయడంతోపాటు హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఏర్పాటు ఆవశ్యకతను అందరికీ వివరించామని చెప్పారు. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములకు ఎకరాకు రూ.12.50 లక్షల చొప్పున్న పరిహారం ఇవ్వాలని తొలుత నిర్ణయించినప్పటికీ ఆ తర్వాత దాన్ని రూ.16 లక్షలకు పెంచామని, దానికి అదనంగా రైతులకు 121 చదరపు గజాల చొప్పున స్థలాలను కూడా కేటాయిస్తున్నామని వివరించారు. నోటీసులకు సమాధానం ఇవ్వనందున అధికారులు జారీ చేసిన పరిహారం మొత్తాన్ని భూసేకరణ అథారిటీ వద్ద డిపాజిట్ చేశామని తెలిపారు.

ముల్కనూరు ప్రజాగ్రంథాలయం

ప్రజాగ్రంథాలయంలో నేడు దశాబ్ది ఉత్సవాలు

- 2023 కథల పోటీల విజేతలకు బహుమతుల పంపిణీ
- 'నమస్తే తెలంగాణ-ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' నిర్వహణ

హనుమకొండ సబర్బన్, భీమదేవరపల్లి, సెప్టెంబర్ 21: ముల్కనూరు ప్రజాగ్రంథాలయం దశాబ్ది ఉత్సవాలకు సిద్ధమెంది. 'నమస్తే తెలంగాణ' దినపత్రిక-ముల్కనూరు ప్రజాగ్రంథాలయం సంయుక్తంగా ఏటా కథల పోటీలు నిర్వహిస్తున్నది. ఇదే తరహాలో నిర్వహించిన 'కథల పోటీలు-2023' విజేతల ఎంపిక ప్రక్రియ పూర్తికాగా.. ఆదివారం దశాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇదే వేదికపైనే విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో 2014లో ఆ గ్రామ పూర్వ విద్యార్థులు ప్రజాగ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. అంచెలంచెలుగా ఎదగి ముల్కనూరు ప్రజాగ్రంథాలయంగా రూపుదిద్దుకొన్నది. నిత్యం వందలాది మందితో కిటకిటలాడే ఈ గ్రంథాలయం ఇప్పుడు దశాబ్ది ఉత్సవాలకు ముస్తాబైంది. ముఖ్య అతిథులుగా రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మాజీ మంత్రి కెప్టెన్ లక్ష్మీకాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీశ్‌కుమార్, అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, తెలుగు కవి అందెశ్రీ, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, హనుమకొండ జడ్పీ మాజీ చైర్మన్ మారపల్లి సుధీర్‌కుమార్, నమస్తే తెలంగాణ దినపత్రిక ఎడిటర్ తిగుళ్ల కృష్ణమూర్తి హాజరుకానున్నట్టు నిర్వాహకులు సీఎంవో ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ వంగ రవి తెలిపారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల విధుల బహిష్కరణ

నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో వనపర్తి జిల్లా కొత్తకోట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్, వాచ్‌మెన్, ప్లాంబర్ కం ఎలక్ట్రీషన్, గెస్టు ఫ్యాకల్టీ ఉద్యోగులు శనివారం విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో ఎన్నడూ ఇలాంటి సమస్య రాలేదని, ఇప్పటికైనా ప్రభుత్వం వేతనాలు త్వరగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. -కొత్తకోట

ఎల్ఈడీ బల్బుల తయారీని వివరిస్తున్న రాజశేఖర్

ట్యూబ్‌లైట్ తయారీపై వర్క్‌షాప్

నారాయణపేట రూరల్, సెప్టెంబర్ 21 : జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల 8, 9వ తరగతి విద్యార్థులకు శనివారం ఎల్ఈడీ ట్యూబ్‌లైట్, వర్మీకంపోస్ట్ ఎరువు తయారీపై ఒకరోజు వర్క్‌షాప్‌ను జాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించినట్లు ఎన్‌జీసీ జిల్లా సమన్వయకర్త భానుప్రకాశ్ తెలిపారు. కార్యక్రమానికి ఎన్‌జీసీ రాష్ట్ర ప్రాజెక్ట్ అధికారి రాజశేఖర్, ఇన్‌చార్జి అకాడమిక్ మానిటరింగ్ అధికారి రాంచంద్రాచారి హాజరయ్యారు. రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజశేఖర్ ఎల్ఈడీ బల్బుల తయారీ విధానాన్ని వివరించారు. విద్యార్థులు స్వయంగా ఎల్ఈడీ బల్బులను తయారు చేశారు. అనంతరం విద్యార్థులు, గైడ్ టీచర్లకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో అధికారులు నాగార్జునరెడ్డి, శ్రీనివాస్, రాజేంద్రకుమార్, జీహెచ్ఎం భారతి పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల ప్రొసీడింగ్స్ అందజేత

జడ్చర్ల, సెప్టెంబర్ 21: మున్సిపాలిటీలోని 3వ వార్డులో శనివారం సబ్సిడీ గ్యాస్ సిలిండర్ల ప్రొసీడింగ్ పత్రాలను మున్సిపల్ కమిషనర్ రాజయ్య లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 3వ వార్డులో మొత్తం 289మందికి పత్రాలురాగా కమిషనర్ 250మందికి అందజేశారు. కార్యక్రమంలో వార్డు అధికారి కృష్ణయ్య, స్వాతి, సరిత ఉన్నారు. అదేవిధంగా కమిషనర్ రాజయ్య శనివారం పట్టణంలో శానిటేషన్, డ్రైనేజీ క్లీనింగ్ పనులను పరిశీలించారు.

ఘనంగా ప్రపంచ శాంతి దినోత్సవ ర్యాలీ

శాంతిర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

మక్తల్, సెప్టెంబర్ 21: అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏకలవ్య స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం పాఠశాల విద్యార్థులతో మక్తల్ పట్టణంలో శాంతిర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకలవ్య స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు గోపాలం మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ కలిసిమెలిసి ఉన్నప్పుడే శాంతిగా ఉండగలుగుతామని పేర్కొన్నారు కార్యక్రమంలో లిటిల్ ఏంజిల్స్ పాఠశాల కరస్పాండెంట్ జగదీశ్‌కుమార్, ప్రిన్సిపాల్ మహబూబ్ అలీ, పీఈటీలు దామోదర్, అమ్రేశ్, ఉపాధ్యాయులు సతీశ్, ఇందిరా, రాజేశ్వరి, నజ్మా మున్సీసా, విద్యార్థులు పాల్గొన్నారు.

పేకాటస్థావరంపై పోలీసుల దాడులు

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 21: జిల్లా కేంద్రంలో ఓ ఇంట్లో పేకాడుతున్న వారిని టూటౌన్ పోలీసులు రెడ్‌హ్యాండెండ్‌గా పట్టుకున్నారు. పట్టణంలోని ఏవీడి థియేటర్స్ సమీపంలోని ఓ ఇంట్లో పేకాడుతున్నట్లు టూటౌన్ సీఐ ఎజాజ్ అహ్మద్‌కు శనివారం రాత్రి సమాచారం వచ్చింది. విషయం తెలుసుకున్న వెంటనే సీఐ సిబ్బందితో కలసి పేకాడుతున్న గృహంపై దాడులు నిర్వహించారు. దాడుల్లో నగదు ఉంచి పేకాడుతున్నట్లు గుర్తించారు. వెంటనే అందరిని ఘటనా స్థలంలోనే పట్టుకొని టూటౌన్‌కు తరలించారు. వీరిని విలేకరుల సమావేశంలో ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. 15 మందిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు చెప్పారు. అనంతరం ఎవరైనా అసాంఘిక కార్యకాలపాలకు పాల్పడినట్లు తమ దృష్టికి వస్తే సమాచారం ఇవ్వాలన్నారు. దాడుల్లో ఎస్సైలు విజయభాస్కర్, ఓబుల్ రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ శేఖర్, రఘునాథ్‌రెడ్డి, పీసీలు బాబ్యానాయక్, ఖలీం, మురళి, వెంకట్రాములు, శ్రీనివాస్, సత్యనారాయణ, శివ, హోంగార్డులు హుస్సేన్, రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని చాటాలి

నవాబ్‌పేట : ఎస్‌జీఎఫ్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎస్సై విక్రమ్

ఊట్కూర్ : క్రీడాకారులతో అధికారులు, ప్రజాప్రతినిధులు

నవాబ్‌పేట, సెప్టెంబర్ 21: విద్యార్థులు పోటీల్లో క్రీడాస్ఫూర్తిని చాటాలని ఎస్సై విక్రమ్ సూచించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అండర్-14 ఎస్‌జీఎఫ్ మండల స్థాయి టోర్నీకి ఎస్సై హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. విద్యార్థులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని కోరారు. క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వం నుంచి మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. మండలంలోని వివిధ గ్రామాల ఉన్నత పాఠశాలల విద్యార్థులు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో హోరాహోరీగా తలపడ్డారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయరామ్‌నాయక్, ఎంఈవో రాజునాయక్, మండల నోడల్ అధికారి నాగ్యానాయక్, పీఈటీలు వినోద్‌కుమార్, మేరీపుష్ప, నాగరాజు, ఖాజా, అర్చన, ఆనందచారి పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఊట్కూర్, సెప్టెంబర్ 21: క్రీడలతో శరీర ధారుడ్యం, మానసికోల్లాసం ఏర్పడుతుందని తాసిల్దార్ చింతరవి, పీఏసీసీఎస్ చైర్మన్ బాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలకేంద్రంలో పాఠశాల విద్యార్థులకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు దివంగత సర్పంచులు ఎల్కోటి ఎల్లారెడ్డి, గొల్ల చిన్నయ్య, మోట్కార్ నర్సిరెడ్డి, సుశీలమ్మ జ్ఞాపకార్థం బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సూర్యప్రకాశ్‌రెడ్డి, డీవైఎఫ్‌వో వెంకటేశ్, జీహెచ్ఎం కుసుమ, పీఈటీలు పాల్గొన్నారు.

కేంద్ర నిధులతోనే తండాల అభివృద్ధి

మరికల్, సెప్టెంబర్ 21 : గిరిజన తండాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని బీజేపీ సభ్యత్వాల జిల్లా కన్వీనర్ లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గాజులయ్యతండా, బుడ్డెగానితండాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీ డీకే అరుణ సహకారంతో గ్రామాల్లో అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

దామరగిద్ద, సెప్టెంబర్ 21 : మండలంలోని ఆశన్‌పల్లికి చెందిన నవీన్ భార్య సునీత గత నెల 13వ తేదీన హైదరాబాద్‌లోని నీలోఫర్ దవాఖానలో కవలకు జన్మనిచ్చి చనిపోయింది. విషయం తెలుసుకున్న జోగి సంఘం నాయకులు శనివారం ఆశన్‌పల్లికి వెళ్లి బాధిత కుటుంబానికి రూ.28,700ల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజు, మల్లప్ప, సదానందం, శ్రీనివాస్, శ్రీధర్, రవి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌నేత పరామర్శ

భూత్పూర్, సెప్టెంబర్ 21: పట్టణంలోని అమిస్తాపూర్‌లో బీఆర్‌ఎస్ నాయకుడు జైపాల్ తండ్రి కృష్ణయ్య అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలిసిన మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ శనివారం మృతుడి ఇంటికెళ్లి పార్థివదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ రామకృష్ణ, కోఆప్షన్ అజీజ్, బీఆర్‌ఎస్ నాయకులు సాయిలు, బాలస్వామి, వెంకటేశ్ పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన

ఊట్కూర్, సెప్టెంబర్ 21: పోషణ మాసం సందర్భంగా మండలంలోని కొత్తపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నప్రాసన, గ ర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ గీత గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఇందిర, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిరోజూ పాఠశాలకు పంపాలి



సమావేశానికి హాజరైన తల్లిదండ్రులు

మక్తల్, సెప్టెంబర్ 21: ప్రతివిద్యార్థి రోజూ పాఠశాలకు హాజరయ్యే విధంగా తల్లిదండ్రులు చర్యలు చేపట్టాలని జెడ్పీహెచ్‌ఎస్ బాలుర జీహెచ్ఎం అనిల్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన తల్లిదండ్రులకు విద్యార్థులు పూలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జీహెచ్ఎం మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాలలో కంటే ఇంటి వద్దనే ఎక్కువ సమయం గడుపుతారని, తల్లిదండ్రులు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి చదువుపై ఎక్కువ దృష్టిపెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులను పాఠశాలకు క్రమం తప్పకుండా పంపించాలన్నారు.

సర్వీస్ రూల్స్ సాధించే దిశగా పోరాటం



పీఆర్టీయూ మక్తల్ మండల కార్యవర్గం

మక్తల్, సెప్టెంబర్ 21: ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్‌ను సాధించే వరకు పీఆర్టీయూ పోరాటం చేస్తుందని నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మక్తల్ ప్రాథమిక పాఠశాలలో పీఆర్టీయూ టీఎస్ మండల కార్యవర్గాన్ని జిల్లా గౌరవాధ్యక్షుడు తిరుపతి అధ్యక్షత ఎన్నుకున్నారు. ఎలక్షన్ అబ్జర్వర్‌గా రఘువీర్ వహించారు. మండలాధ్యక్షుడిగా ఎల్లప్ప, ప్రధాన కార్యదర్శిగా బాబు, గౌరవాధ్యక్షుడిగా అబ్దుల్ రెహమాన్‌తోపాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

పీఆర్టీయూ టీఎస్ మండల కార్యవర్గం

నవాబ్‌పేట, సెప్టెంబర్ 21: పీఆర్టీయూ టీఎస్ నూతన కార్యవర్గాన్ని శనివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా యాదయ్య, ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కుమార్‌గౌడ్, అసోసియేట్ అధ్యక్షుడిగా మల్లికార్జున్‌రాజు, ఉపాధ్యక్షుడిగా రాంచంద్రయ్య, మహిళా ఉపాధ్యక్షురాలిగా అరుణాదేవి, కార్యదర్శిగా విజయ్‌కుమార్, మహిళా కార్యదర్శిగా పద్మజ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నారాయణగౌడ్, రఘురాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజునాయక్, సదాశివుడు, రియాజ్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఒలింపిక్ సంఘం ఎన్నికలు

మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబర్ 21: జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో ఆదివారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఒలింపిక్ సంఘం ఎన్నికలు, సర్వసభ్య సమావేశం-2024 నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అడ్‌హక్ కమిటీ సభ్యులు శనివారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌యాదవ్ హాజరవుతారని తెలిపారు.

24న హ్యాండ్‌బాల్ సెలెక్షన్ ట్రయల్స్

నారాయణపేట రూరల్, సెప్టెంబర్ 21 : ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలబాలికల ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా హ్యాండ్‌బాల్ సెలెక్షన్ ట్రయల్స్‌ను ఈ నెల 24న కోస్గి ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి వెంకటేశ్ శనివారం ప్రకటనలో తెలిపారు. పాల్గొనే విద్యార్థులు బోనఫైడ్, ఆధార్‌కార్డు, ప్రోగ్రెస్ కార్డు, ఇంటర్ విద్యార్థులు పదో తరగతి మెమోతో హాజరుకావాలన్నారు. వివరాలకు పీడీ బాలరాజు 9120799991 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

రేపు వీరభద్రస్వామి అగ్నిగుండం

పాలమూరు, సెప్టెంబర్ 21: మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆయానికి అనుసంధానమైన వీరభద్రస్వామి ఆలయంలో ఈనెల 23న అగ్నిగుండ మహోత్సవం, అభిషేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త అళహరి మధుసూదన్‌కుమార్, ఈవో శ్రీనివాసరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 6గంటలకు స్వామివారికి అభిషేకాలు, రాత్రి 11గంటలకు నందికోళ సేవ అనంతరం తెల్లవారుజామున 4గంటలకు అగ్నిగుండం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

చెరువులో చేపలు వదిలిన మత్స్యకారులు



ధన్వాడ పెద్ద చెరువు వద్ద పూజాలు చేస్తున్న నాయకులు

ధన్వాడ, సెప్టెంబర్ 21 : రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో మత్స్య సహకార సంఘాలకు చేపలను అందించకపోవడంతో సొంత నిధులతో ధన్వాడలో మత్స్యకారులు శనివారం పెద్ద చెరువులో చేపలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సహకార సంఘం అధ్యక్షుడు నర్సింహులు నాయుడు ముదిరాజ్ మాట్లాడుతూ.. రాజమండ్రి నుంచి సూమారు రూ.2లక్షల చేపలను తీసుకొచ్చి చెరువులో విడిచినట్లు తెలిపారు. వీటిలో 50వేల బొచ్చలు, రైటా, రోహుగడ్డి చేపలు విడిచిపెట్టడం జరిగిందని తెలిపారు. అంతకు మందు గంగమ్మతల్లికి పూజలు చేశారు. కార్యక్రమంలో బాలరాజు, రాంచంద్రయ్య, రాములు, శివ, ముత్యం, రవి, మహేశ్, శ్రీనివాసులు, సుధాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు

నారాయణపేట, సెప్టెంబర్ 21 : కళాశాలలో ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తీసుకుంటామని షీ టీమ్ పోలీస్ బాలరాజు అన్నారు. శనివారం పట్టణంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల కళాశాలలో షీ టీమ్ పోలీసులు విద్యార్థులకు ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, డ్రగ్స్, గంజాయి, ట్రాఫిక్ చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే షీ టీమ్ 871267 0398 నెంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో షీటీమ్ పోలీసు చెన్నయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బాలరాజు